అనుదినం జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
గురువారం 15 జూన్ 2023

## విద్యార్థినికి రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన వీసీ

నవతెలంగాణ-బాసర



ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో ఆత్మహత్యకు పాల్పడ్డ వడ్ల దీపిక కుటుంబానికి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణ బుధవారం రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. యూనివర్సిటీలో నిర్వహించిన సంతాప సభలో వీసీ వెంకటరమణ, డైరెక్టర్ సతీష్ కుమార్ విద్యార్థిని దీపిక చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఉన్నత విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు రూ.లక్ష అందిస్తున్నట్లు పేర్కొన్నారు. యూనివర్సిటీలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమని మరో మరో ఇలాంటి ఘటన చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## జీ20 కార్యక్రమాలలో భాగస్వాములు కావాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్



ప్రపంచ దేశాల ఐక్యత కోసం చేపట్టిన జీ20 కార్యక్రమాలలో గ్రామీణ స్థాయి నుండి ప్రతి ఒక్కరూ భాగస్వాములై కార్యక్రమాలను విజయవంతం చేయాలని జన శిక్షణ సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ చెన్నాల రాజన్న తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీలోని మహిళలతో రన్నింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. ప్రతిరోజు వ్యాయామం యోగా చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జన శిక్షణ సంస్థాన్ సిబ్బంది సంతోష్, రాజు, ధనలక్ష్మి పాల్గొన్నారు.

# క్యాస్ట్..ఇన్‌కం కష్టాలు..!

- కిటకిటలాడుతున్న తహసీల్దార్, మీసేవ కేంద్రాలు
- ధ్రువపత్రాలు సకాలంలో లభించక అవస్థలు
- రూ.లక్ష సాయం కోసం దరఖాస్తుల వెల్లువ
- ఈ నెల 20వరకే గడువు..లబ్ధిదారుల్లో ఆందోళన

**ప్రభుత్వం అందించే రూ.లక్ష రుణ సాయం కోసం లబ్ధిదారులు పడరాని పాట్లు పడుతున్నారు. దరఖాస్తు చేసేందుకు కుల, ఆదాయ ధ్రువపత్రాలు తప్పనిసరిగా జత చేయాల్సి రావడంతో వాటి కోసం తంటాలు పడుతున్నారు. తహసీల్దార్, మీసేవా కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. ఇది వరకు ఆయా ధ్రువపత్రాలు అందుబాటులో లేకపోవడం.. కొత్తగా తీసుకోవాల్సి ఉండటం..రుణం కోసం దరఖాస్తు గడువు సమీపిస్తుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు రూ.లక్ష రుణ సాయం కోసం బీసీ కుల, చేతివృత్తుదారుల దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాల వారీగా ఎన్ని యూనిట్లు అందిస్తారనే ప్రభుత్వం వెల్లడించకపోవడంతో ఆయా అర్హులైన కులాలకు చెందిన లబ్ధిదారులంతా దరఖాస్తులు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మరోపక్క క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికేట్లను మూడు రోజుల్లో జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినప్పటికీ.. స్థానిక రెవెన్యూ సిబ్బంది తీవ్ర జాప్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.**



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, సిరికొండ

రాష్ట్ర ప్రభుత్వం కుల, చేతి వృత్తిదారులకు రూ.లక్ష రుణ సాయం అందిస్తామని ప్రకటించింది. ఇందుకు 14 బీసీ కులాలతో పాటు ఎంబీసీ జాబితాలోని మరో 36 కులాలకు చెందిన వారు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ నెల 6వ తేదీన మంత్రి గంగుల కమలాకర్ వెబ్‌సైట్‌ను ప్రారంభించినా.. దరఖాస్తులు మాత్రం ఈ నెల 9వ తేదీ నుంచి స్వీకరిస్తోంది. దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈ నెల 20వ తేదీ వరకు విధించింది. ఇందుకు గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల వరకు ఉండాలని స్పష్టం చేసింది. దరఖాస్తులకు అతి తక్కువ సమయం ఉండటం.. చేతిలో ఆయా ధ్రువపత్రాలు లేకపోవడంతో దరఖాస్తులకు ఆటంకం కలుగుతోంది. అనేక మంది బీసీ కుల, చేతివృత్తిదారులు ప్రభుత్వం వందశాతం రాయితీతో అందించే ఈ రుణాల కోసం ఆతృతగా ఉన్నారు. రుణం పొందేందుకు కావాల్సిన ధ్రువపత్రాల కోసం మీసేవ, తహసీల్దార్ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. చాలా మంది వద్ద కుల, ఆదాయ ధ్రువపత్రాలు లేకపోవడంతో రుణ దరఖాస్తులకు ఆటంకం ఏర్పడుతోంది. దీంతో ఆయా పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది. వీటిని పొందాలంటే ముందుగా ఆర్ఐ, డీటీ సంతకాలతో పాటు తహసీల్దార్ సంతకం పెట్టాల్సి ఉంటుంది. అప్పుడే ఆయా ధ్రువపత్రాలను తిరిగి మీసేవలో తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఆయా మండల కేంద్రాల్లో రెవెన్యూ సిబ్బంది అందుబాటులో లేకపోవడం.. విధుల నిమిత్తం బయటకు వెళ్తుండటం కారణంగా లబ్ధిదారులకు సకాలంలో ధ్రువపత్రాలు లభించడం లేదని తెలుస్తోంది.

**సమీపిస్తున్న గడువుతో ఆందోళన**

ప్రభుత్వం అందించే రుణం కోసం దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 20వ తేదీ వరకు మాత్రమే గడువు ఉండటం లబ్ధిదారులను ఆందోళనకు గురిచేస్తోంది. కుల, ఆదాయ ధ్రువపత్రాలు సకాలంలో లభించకపోవడం మూలంగా తీవ్ర వేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం అందించే ఈ సాయం ఆర్థికంగా చేదోడుగా ఉంటుందనే ఉద్దేశంతో అనేక మంది బీసీ కుల, చేతివృత్తిదారులు దరఖాస్తులు చేసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కానీ రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సకాలంలో ధ్రువపత్రాలు లభించని పరిస్థితి నెలకొంది. చాలా మంది పనులు మానుకొని మీసేవ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఆయా ధ్రువపత్రాలకు తహసీల్దార్ కార్యాలయంలో సంతకాల ప్రక్రియలో ఆలస్యం కావడం.. లబ్ధిదారులు మాత్రం దరఖాస్తు చేసిన మీసేవకు వెళ్లి ఎందుకు ఇవ్వడం లేదని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోపక్క ప్రభుత్వం జిల్లాల వారీగా ఆయా కులాల వారికి ఎన్ని యూనిట్లు అందజేస్తారనేదానిపై స్పష్టతనివ్వలేదు. దీంతో యూనిట్ల నిర్ధారణ అనేది లేకపోవడంతో అందరికీ అందజేస్తుందనే ఆశతో దరఖాస్తులు చేసుకుంటున్నారు.

### యూనిట్ల విషయం నిర్ధారించలేదు

**రాజలింగు, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి, ఆదిలాబాద్**

దరఖాస్తుదారులకు కుల, ఆదాయ ధ్రువపత్రాలు మూడు రోజుల్లో అందించాలని ఇది వరకే జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం జిల్లాకు ఎన్ని యూనిట్లు మంజూరు చేస్తుందనేదానిపై ఇంకా స్పష్టత లేదు. ఇందుకు సంబంధించి ఎలాంటి నిబంధనలు రూపొందించలేదు. దరఖాస్తులు వచ్చిన తర్వాత వాటిపై విచారణ చేపట్టి యూనిట్ల విషయం నిర్ణయిస్తుందని తెలుస్తోంది.

### పనిమానుకొని తిరుగుతున్నా ఫలితం లేదు



**చౌహాన్ లక్ష్మణ్, చేతివృత్తిదారుడు, సిరికొండ**

కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం వారం రోజుల క్రితం దరఖాస్తు చేశాను. పనులు మానుకొని మూడు సార్లు తహసీల్దార్ కార్యాలయానికి అక్కడ్నుంచి మీసేవ కేంద్రానికి వెళ్లాను. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో లేకుండాపోయారు. దరఖాస్తుకు మరో ఐదు రోజులు మాత్రమే గడువు ఉంది. ఇప్పటి వరకు సర్టిఫికేట్లు లభించలేదు. ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలి.

## నిష్పక్షపాతంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పని సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను నిష్పక్షపాతంగా నిబంధనలను అనుసరించి కేటాయించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వైద్య శాంతి కుమారి కోరారు. టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి పార్సి అశోక్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల రెగ్యులైజేషన్ దరఖాస్తులు చేసి దాదాపుగా ఏడాది గడుస్తున్నప్పటికీ రెగ్యులరైజేషన్ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని, త్వరగా పూర్తిచేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందు రావ్, హేమంత్ షిండే, దూలం ఎల్లయ్య, జాదవ్ సుభాష్ పాల్గొన్నారు.

## బస్ పాసులకు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులకు బస్సు పాసులు అందజేస్తున్నామని అర్హత ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 12 సంవత్సరాలలోపు బాలురకు, ఒకటి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న బాలికలకు ఉచిత బస్సు పాసులు ఇస్తున్నట్లు, ఈ పాసులు 20 కిలోమీటర్ల వరకు వర్తిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఆన్‌లైన్.టీఎస్ఆర్టీసీపీఏఎస్ఎస్.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పాసుల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఆయా విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులు ప్రిన్సిపల్స్ పాస్ కౌంటర్ వద్ద తమ విద్యాసంస్థల వివరాలు నమోదు చేయించుకోవాలని, తర్వాతనే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హత సాధిస్తారని పేర్కొన్నారు.

## శిలాఫలకంపై రాజకీయ నేతల పేర్లు రాయొద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

జిల్లా కేంద్రంలోని నేతాజీ చౌక్‌లో నూతన నేతాజీ కాంస్య విగ్రహాన్ని త్వరలో ఆవిష్కరించనున్న నేపథ్యంలో శిలాఫలకంపై ఎలాంటి ప్రజా ప్రతినిధుల పేర్లు, రాజకీయ నేతల పేర్లు పెట్టొద్దని ఏబీవీపీ ఆదిలాబాద్ శాఖ నాయకులు కోరారు. ఈ మేరకు ఏబీవీపీ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులకు బుధవారం వినతిపత్రాన్ని అందజేసారు. కొన్ని దశాబ్దాల క్రితం ఆవిష్కరించిన నేతాజీ విగ్రహాన్ని కొన్ని రోజుల క్రితం సుందరికారణలో భాగంగా ఆదిలాబాద్ మున్సిపల్ యంత్రాంగం తొలగించి, అదే స్థానంలో నేతాజీ నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. విగ్రహం నిర్మాణ అనంతరం శిలఫలకం పైన ఎలాంటి రాజకీయ నాయకుల పేర్లను రాయబోమని మున్సిపల్ అధికారులు అప్పుడు హామీ ఇచ్చారు. మరో రెండు మూడు రోజుల్లో విగ్రహ ఆవిష్కరణ ఉందన్నారు. ఒక వేళ ఎవరివైనా పేర్లు పెట్టినట్లైతే ఆదిలాబాద్‌లో పెద్ద ఎత్తున ఉద్యమం చేయడానికి వెనుకాడేది లేదన్నారు.

## జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పరామర్శ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌కు చెందిన బ్యాంకు ఉద్యోగి కందుల ధర్మేందర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందటంతో బుధవారం జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే జోగు రామన్న ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పట్టణంలోని కుమార్‌పేట్‌లో ఏర్పాటు చేసిన పెద్దకర్మకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా కందుల ధర్మేందర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మృతుడు ధర్మేందర్ తమ్ముడు ఈనాడు రిపోర్టర్ కందుల మహేందర్, కందుల గజేందర్, మృతుని కుమారుడు కందుల సంకల్ప్ (సన్నీ)తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజారెడ్డి సంతాపాన్ని ప్రకటించారు.

## తండ్రి జ్ఞాపకార్థం అంబలి పంపిణీ

నవతెలంగాణ-చింతలమానపల్లి

మండలంలోని అంగడి (వారసంత)లో బుధవారం బెజ్జూరు మండలంలోని బారేగూడ సర్పంచ్ రేణికుంట్ల సంతోష్ తండ్రి రేణికుంట్ల సదాశివ్ జ్ఞాపకార్థం అంబలి పంపిణీ చేశరు. ఈ కార్యక్రమంలో కోట సాయి కృష్ణ, మా ఫౌండేషన్ ప్రతినిధి లోడేల్లి ప్రవీణ్, ఆర్ఎంపీ డాక్టర్ శేఖర్, బురుకుటే వెంకన్న పాల్గొన్నారు.

## నీట్ ఫలితాల్లో రిసోనెన్స్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల విడుదలైన నీట్-2023 పరీక్షా ఫలితాల్లో ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. స్థానిక రిసోనెన్స్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు నీట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి అర్హత సాధించడంతో వారిని కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. రాథోడ్ అంజలి 6760, సిడం దివ్య 7183, కరుణశ్రీ 19787, గోలి కౌశిక్ 62279, కృపాలి 82519 ర్యాంకులను సాధించి వారి ప్రతిభను కనబర్చారు. ఈ సందర్భంగా రిసోనెన్స్ అకాడమీ డైరెక్టర్ ప్రమోద్ రెడ్డి విద్యార్థులను అభినందించారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

**సారంగాపూర్ :** మండలంలో వివిధ గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలను బుధవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పరామర్శించారు. మండల కేంద్రంలోని గ్రామ ఉపసర్పంచ్ దేవి ముత్యం తండ్రి రాజన్న, అలాగే సన్ రైస్ టైలర్ రాజేశ్వర్, దని గ్రామంలో గొల్ల లక్ష్మీ దుప్యా తండా సర్పంచ్ ప్రహ్లాద్ వాళ్ల అన్నయ్య జాదవ్ ఈశ్వర్‌ల కుటుంబాల సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని బరోసా నిచ్చారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబానికి పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు.

# రాష్ట్రంలో గొప్ప పథకం న్యూట్రిషన్ కిట్

- ఘనంగా వైద్యారోగ్య దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో దేశంలోనే ప్రథమంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన గొప్ప పథకం న్యూట్రిషన్ కిట్ అని జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ తెలిపారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుక ఉత్సవాలలో భాగంగా స్థానిక జనార్ధన్‌రెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన వైద్యారోగ్య దినోత్సవ కార్యక్రమాన్ని జడ్పీ చైర్మన్, జిల్లా కలెక్టర్, స్థానిక శాసన సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా జిల్లాలో వైద్యారోగ్య శాఖ ప్రగతి నివేదికను, రిమ్స్ ఆసుపత్రిలో అందిస్తున్న వైద్యసేవలను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌లు వివరించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణలో పుట్టబోయే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని, గర్భిణీ మహిళల రక్తహీనతను అరికట్టడానికి హార్లిక్స్, ఐరన్, సిరప్, ఖర్జూరం, నెయ్యి, పల్లి చిక్కి, హార్లిక్స్, త్రాగడానికి కప్పు, వస్తువులను అమర్చుకోడానికి బాస్కెట్ లాంటి 3వేల విలువగల న్యూట్రిషన్ కిట్‌లను అందించడం జరుగుతుందన్నారు. ప్రయివేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందించడంతో ప్రజల్లో నమ్మకం పెరిగిందన్నారు. తెలంగాణా సాధించుకున్న తరువాత విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పి.ఎస్. మాట్లాడుతూ ఆరోగ్య ఆదిలాబాదు జిల్లాగా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 2 నుండి 22 వరకు వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించడం జరుగుతుందని, ఇప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమాలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళాల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పేదింటి ఆడపిల్ల పెళ్ళికి కల్యాణలక్ష్మి పథకం, గర్భిణీలకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, ఆరోగ్య లక్ష్మి, బాలింతలకు కేసీఆర్ కిట్, ప్రసవానంతరం నగదు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలు అందించడంతో పాటు సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచడం జరిగిందన్నారు. రక్త హీనతను నియంత్రించేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా పౌష్టికాహారం అందించడంతో మాతాశిశుమరణాలను నియంత్రించడం జరిగిందన్నారు. ఇదే స్పూర్తితో మరింత మెరుగైన వైద్యసేవలు అందించి రాష్ట్రంలోనే ఆదిలాబాద్ జిల్లాను ఆరోగ్య ఆదిలాబాదు జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు పాటుపడాలని కలెక్టర్ కోరారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ, ఆరోగ్యమే మహా భాగ్యమని, పేద ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోంటోందన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వైద్య అధికారులకు, సిబ్బందికి శుభాకంక్షాలు తెలిపారు. అనంతరం కార్యక్రమంలో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు, ఏఎన్ఎం, ఆశలకు చీరలను, కంటివెలుగు లబ్దిదారులకు అద్దాలను, వైద్య సిబ్బందికి బీపీ చెకప్ పరికరాలను అందించడంతో పాటు వైద్యశాఖకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఉత్తమ వైద్య సేవలందించిన వైద్యలు, సిబ్బందిని శాలువా, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి.

**రిమ్స్‌లో పండ్ల పంపిణీ**

అంతకుముందు పట్టణంలోని రిమ్స్‌లో వైద్య విద్యార్థులు వేసిన ముగ్గులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రిమ్స్‌లోని వివిధ వార్డులోని రోగులకు ఆయన పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమాలలో ఆర్డీఓ రమేష్ రాథోడ్, జడ్పీ సీఈఓ గణపతి, డీపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



# పోడు పట్టాల పంపిణీ షెడ్యూల్ ప్రకటించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఈ నెల 24వ తేదీన ముఖ్యమంత్రి జిల్లాకు వస్తున్న నేపథ్యంలో కోడి పట్టాల పంపిణీ షెడ్యూల్ ప్రకటించి ఆర్ఓ ఎఫ్ఆర్ గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులకు హక్కు పత్రాలు పంపిణీ చేయాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోరంగ మాలశ్రీ, నేర్పల్లి అశోక్ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ బొర్కాడే హేమంత్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో పోడు భూములకు హక్కు పత్రాలు ఈ నెల 24 నుండి ఇస్తానని ప్రకటించిందని ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జిల్లా నుండి పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. పోడు పట్టాల పంపిణీ షెడ్యూలు విడుదల చేయాలని, ఏ మండలంలో ఏ రోజు ఇస్తారో ప్రకటించాలని, అర్హులైన అందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. దళారుల ప్రమేయం లేకుండా చూడాలని, పోడు పట్టాలు వచ్చినా వారి లిస్ట్‌లు గ్రామ పంచయతీల్లో బోర్డులపై ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి నల్లి దామోదర్, జిల్లా కమిటీ సభ్యులు కొర్వేత చిన్ను, దూల లక్ష్మి, సుంకె లక్ష్మీ పాల్గొన్నారు.

## ప్రారంభమైన కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

కానిస్టేబుల్, ఎస్సై నియామకానికి అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ మొదలైనట్లు ఆదిలాబాద్ ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను ఆయన ప్రారంభించారు. ఉదయం నుండి అభ్యర్థులు తమ కేటాయించిన స్థలాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగుతోందని పేర్కొన్నారు. మహిళా అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యతగా కేటాయించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వివరించారు. మొదటి రోజు 500 అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా 445 అభ్యర్థులు హాజరై సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకున్నారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీనివాస్‌రావు, ఏఓ యూనిస్ అలీ పాల్గొన్నారు.

## జొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సారంగాపూర్

జొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ నారాయణరెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ అశ్విత శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం కౌట్ల(బి) సొసైటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన జొన్న పంటను ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించి క్వింటాల్‌కు రూ.2970 పొందాలన్నారు. కార్యక్రమంలో డీసీఓ శ్రీనివాసరెడ్డి, మార్క్‌ఫెడ్ ఎండీ ప్రవీణ్ రెడ్డి, సీఈఓ సలీం, రైతుబంధు మండల కన్వీనర్ మధుకర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ సుజాత నర్సారెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవ్‌రావు, నాయకులు గంగారెడ్డి పాల్గొన్నారు.

## నీట్ పరీక్షా ఫలితాల్లో సత్తా చాటిన ఎస్ఆర్ విద్యార్థులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఇటీవల విడుదలైన నీట్ 2023 పరీక్షా ఫలితాల్లో ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. స్థానిక ఎస్ఆర్ జూనియర్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు నీట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి అర్హత సాధించడంతో వారిని కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. అయేష్ ఫాతిమా 1940వ ర్యాంక్, చౌహన్ మైథిలి (492), దాసరి విష్ణువర్ధన్(453), జె.సియా రాణి(435), అగర్వాల్ రాధికా(410), యోగీత పవర్(395 ), రాథోడ్ అక్షయ(367), తాడూరి నందిత(364), బొల్లి అభినయ శ్రీ(360 )తో మొత్తం 9 మంది విద్యార్థులు నీట్-2023 కి అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బుధవారం కళాశాల చైర్మన్ వరదరెడ్డి, డైరెక్టర్స్ సంతోష్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, జోనల్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్స్ కె.బ్రహ్మం, జైపాల్‌రెడ్డి, అరవింద్ లెక్చరర్స్ అభినందనలు తెలిపారు. ఎస్ఆర్ కళాశాల చైర్మన్ వరదరెడ్డి, డైరెక్టర్స్ సంతోష్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, జోనల్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్స్ బ్రహ్మం, జైపాల్‌రెడ్డి, అరవింద్ వారిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం టపాసులు పేలుస్తూ సంబరాలు జరుపుకున్నారు.

## పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-సిరికొండ



మండలంలోని వాయిపేట్ గ్రామ పంచాయతీ కార్యదర్శి విధులు సక్రమంగా నిర్వహించడం లేదని కోరుతూ బుధవారం గ్రామస్తులంతా కలిసి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సురేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా విధులను సక్రమంగా నిర్వహించడం లేదని, గ్రామ పంచాయతీకి సంబంధించిన సమాచారాన్ని, ఎన్ని నిధులు వచ్చాయి, ఎంత ఖర్చు చేశారు. అనే సమాచారం అడిగిన ఇవ్వడం లేదని అన్నారు. గ్రామానికి ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తమకు సమాచారం లేదని, మ్యారేజ్ సర్టిఫికేట్, బర్త్ సర్టిఫికేట్ తదితర పనుల కోసం వేచి చూడాల్సి వస్తోందని అన్నారు. వెంటనే పంచాయతీ కార్యదర్శి దుర్గయ్యను తొలగించాలని ఎంపీడీఓను వారు కోరారు.

## కాంగ్రెస్‌లో చేరిన కూచాడి శ్రీహరిరావు

నవతెలంగాణ-నిర్మల్



నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమ కారుడు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కూచాడి శ్రీహరిరావు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సమక్షంలో తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కోసం ఆదిలాబాద్ పశ్చిమ జిల్లాలో ఉద్యమాన్ని ముందుండి నడిపించిన శ్రీహరిరావు కాంగ్రెస్‌లో చేరడం శుభపరిణామని రేవంత్‌రెడ్డి అన్నారు. అనంతరం శ్రీవారిరావు మాట్లాడుతూ తన రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్‌తోనే ప్రారంభమైందని, మళ్లీ సొంత గూటికి రావడం ఆనందంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ని అధికారంలోకి తీసుకొచ్చి, తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీకి బహుమతి ఇద్దామని పేర్కొన్నారు.

## బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-బేల

మండలంలోని ఖార గ్రామంలో బుధవారం మనోహర్ పటేల్‌తో పాటు గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన వారు ఎమ్మెల్యే జోగు రామన్న నాయకత్వాన్ని బలపరుస్తూ స్వచ్ఛందంగా జోగు రామన్న సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం చెప్పని హామీలు సైతం అమలు చేస్తుంటే, బీజేపీ కేంద్రప్రభుత్వం కనీసం చెప్పినవాటినైనా అమలు చేయాలని ప్రశ్నించారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం మహిళలపై పరోక్షంగా కక్షసాధింపులకు పాల్పడుతుందని, అందులో భాగంగానే నిత్యావసర సరుకుల రేట్లు, గ్యాస్ ధరలు, మహిళల అకౌంట్‌లో రూ.15లక్షలు, నిరుద్యోగ యువతకు రెండు కోట్ల ఉద్యోగాలు, అంటూ వారి ఆత్మాభిమానం దెబ్బతినేలా బీజేపీ కేంద్రం వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రావుత్ మనోహర్, బీఆర్ఎస్ మండల నాయకులు గంభీర్ ఠాక్రె, సతీష్ పవార్, కళ్లెం ప్రమోద్‌రెడ్డి, పారట్కర్ బాల్‌చందర్, గోడం సునీల్, మీస సుదామ్ పాల్గొన్నారు.

## నేడు చిన్నపిల్లలకు ఉచిత వైద్య శిబిరం

- నియోకేర్ పిల్లల దవాఖాన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని నియోకేర్ పిల్లల దవాఖానలో చిన్నపిల్లలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. ఈ నెల 15న గురువారం ఉదయం 9.30 నిమిషాలకు నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. సరిగా మాట్లాడలేక పోవడం, తరచు పిట్స్ రావడం, అన్నం సరిగ్గా తినకపోవడం, విటమిన్స్ లోపం, పసిరికలు పిల్లలలో ఎదుగుదల లేకపోవడం, హార్మోన్స్ సమస్యలు, గోర్లు కొరకడం, సరిగ్గా నడవలేక పోవడం, ఇంకా ఇతర సమస్యలతో బాధపడుతున్నవారు సంప్రదించవచ్చని సూచించారు. పిల్లల ఎదుగుదల, న్యూట్రీషన్ హార్మోన్స్ సమస్యలకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే అందుబాటులో ఉన్న మందులు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

**హాస్పిటల్‌లో లభించే సేవలు...**

వెంటిలేటర్‌తో కూడిన ఎన్ఐసీయూ, నవజాత శిశువుల ఇంటెన్సివ్ కేర్, 24 గంటల ఎమర్జెన్సీ సేవలు, ల్యాబ్ సేవలు, 24 గంటలు ఇన్ హౌజ్ కన్సల్టెంట్స్, పిల్లల ఇంటెన్సివ్ కేర్, 24 గంటల అంబులెన్స్ సౌకర్యం, స్పెషల్ రూమ్స్ అలాగే అన్నీ రకాల టీకాలు ప్రతిరోజు ఇస్తామని అన్నారు. అప్పుడే పుట్టిన పిల్లల నుండి 14 సంవత్సరాలలోపు పిల్లలకు అన్ని రకాల వ్యాధులకు ప్రతిరోజు చూస్తామని అన్నారు. ఆస్పత్రి అడ్రస్ పట్టణంలోని టీఎన్‌జీఓ రోడ్, నేతాజి చౌక్, ఆదిత్య హాస్పిటల్ ప్రక్కన వివరాలకు ఫోన్: 9000885957, 9000814957 నెంబరును సంప్రదించాలని సూచించారు. తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పట్టణ, గ్రామీణ ప్రజలకు సూచించారు.

## విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని వివిధ ఎరువులు, పురుగులమందుల దుకాణాలు, సీడ్ ప్రాసెసింగ్ సంస్థలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోథ్ వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీధర్ స్వామి, మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి వివిధ ఫెర్టిలైజర్స్ దుకాణాలలోని విత్తనాలు, ఎరువుల స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. అలాగే ఎరువులు, విత్తనాలకు సంబంధించిన నాణ్యతను పరిశీలించారు. అనంతరం బోథ్ వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీధర్ స్వామి, మండల వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు విక్రయించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు డీలర్ల వద్ద కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులకు సంబంధించిన రశీదులను విధిగా తీసుకోవాలని సూచించారు. ఈ రశీదులను పంట కాలం పూర్తి అయ్యే వరకు రైతులు భద్రంగా దాచిపెట్టుకోవాలని అన్నారు. పంట నష్టపరిహారం కావాలంటే ఈ రశీదులు తప్పని సరి అని అన్నారు. అదేవిధంగా ఫెర్టిలైజర్ దుకాణాల వారు విధిగా స్టాక్స్ బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. ప్యాకింగ్ తీసిన విత్తనాలు, గడువు ముగిసిన విత్తనాలను విక్రయించవద్దన్నారు. నాసిరకం విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీడ్స్ దుకాణాల యజమానులు, రైతులు పాల్గొన్నారు.

**విత్తనాల కొనుగోలుపై రైతులు జాగ్రత్తలు పాటించాలి**

విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈఓ సంజీవ్ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని టెంబి, అనంతపూర్ గ్రామాల రైతులకు విత్తనాలు, ఎరువులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధీకృత డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాలు, ఎరువులకు సంబంధించిన బిల్లులను భద్రపర్చుకోవాలని అన్నారు. అలాగే భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియా, ట్రికోడర్మా వినియోగం, లాభాల గురించి వివరించారు. రైతులు తొందర పడి విత్తనాలు వేసుకున్నట్లయితే భూమిలో తేమ సమస్య వచ్చి విత్తనాలు, మొలకలు ఉడికిపోయి చనిపోయే అవకాశం ఉంటుందని అన్నారు. 2-3 పెద్ద వర్షాలు (సుమారు 60 ఎంఎం. వర్షం) పడ్డ తర్వాత మాత్రమే విత్తనాలు వేసుకుంటే బాగుంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్య చేసుకున్న దీపిక పోస్టుమార్టం పూర్తి

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్య చేసుకున్న దీపిక అనే విద్యార్థి పోస్టుమార్టం బుధవారం జిల్లా ఆస్పత్రిలో పూర్తయింది. కళాశాల అడ్మినిస్ట్రేషన్ భవనంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని కుటుంబ సభ్యులు కూతురు మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం విద్యార్థిని మృతిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆస్పత్రి వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ జీవన్‌రెడ్డి నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# గణనీయమైన పురోగతిని సాధించాం

- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

వైద్య రంగంలో గణనీయమైన పురోగతిని సాధించామని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎంసీహెచ్‌లో నిర్వహించిన వైద్యారోగ్య దినోత్సవంలో బుధవారం పాల్గొన్నారు. వైద్యారోగ్య దినోత్సవం సందర్భంగా డాక్టర్లులకు, ఆశ వర్కర్లు, వైద్య బృందాలకు ప్రొఫెసర్లకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రసూతి ఆస్పత్రిలో బాలింతలకు కేసీఆర్ కిట్లను అందజేశారు. పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రూ. 23.75 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం దివ్యాగార్డెన్‌లో ఏర్పాటు చేసిన దశాబ్ది వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్తగా ఏర్పడ్డ నిర్మల్ జిల్లా వైద్య రంగంలో గణనీయమైన పురోగతిని సాధించిందని అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో సర్కారు దవాఖానాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఇప్పటికే గ్రామీణం నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ వైద్యశాలలను అభివృద్ధి చేసిందని తెలిపారు. అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తేవడంతో పాటు వివిధ రకాల వైద్య పరీక్షలను కూడా ఉచితంగా అందజేస్తున్నామని వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్‌లో ఇప్పుడున్న 50 పడకలకు అదనంగా రూ. 50 లక్షల వ్యయంతో మరో 30 పడకలతో దీన్ని 80 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు. జిల్లా ఆస్పత్రితో పాటు ఇతర దవాఖానాల్లో మొత్తం 450 పడకలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ ధనరాజ్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.





# కేజీబీవీ పాఠశాల ప్రారంభం

- ఎంపీపీ, ఎమ్మెల్యేల మధ్య వాగ్వాదం



నవతెలంగాణ-సిరికొండ

సిరికొండ మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కేజీబీవీ పాఠశాల ప్రారంభోత్సవం బుధవారం గొడవల మధ్య ప్రారంభమైంది. ముందుగా ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, అధికారులు, స్థానిక నాయకులు కలిసి నూతన పాఠశాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు, నాయకులు మాట్లాడుతుండగా ఎంపీపీ అమృత్‌రావు, జెడ్పీటీసీ చంద్రకళ రఘురామ్‌లు అక్కడికి చేరుకొని ఎమ్మెల్యేను, అధికారులను మీరు ప్రోటోకాల్ పాటించడం లేదని వారితో వాగ్వాదానికి దిగారు. మండల అధ్యక్షుడుకి, జెడ్పీటీసీకి కనీసం సమాచారం ఇవ్వకుండా పాఠశాలను ప్రారంభించడం ఏంటని, 9సంత్సరాల పాలనలో నేర్చుకున్నది ఇదేనా అని ప్రశ్నించారు. కస్తూర్బా పాఠశాల భవన నిర్మాణం పనులు పూర్తి కాకుండానే ఎలా ప్రారంభిస్తారని, పనులు మొత్తం నాసిరకంగా చేశారని అధికారులపై మండి పడ్డారు. మెట్లు ఎక్కితేనే కూలీ పోతున్నాయని గుత్తేదారుతో వాగ్వాదం చేశారు. ప్రోటోకాల్ పాటించని సమావేశంలో పాల్గొనేది లేదని ఎంపీపీ, జెడ్పీటీసీ సమావేశాన్ని బైకాట్ చేశారు. అనంతరం సమావేశం సజావుగా సాగింది. ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేశానని, పిల్లల భవిష్యత్తు కోసం కస్తూర్బా పాఠశాలను మంజూరు చేశామని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేస్తోందని అన్నారు. తెలంగాణలో గురుకులాలు, కస్తూర్బాలను కొత్తగా ఏర్పాటు చేసుకొని విద్యార్థులకు, నాణ్యమైన విద్యను అందించడంతో పాటు సన్న బియ్యం, మంచి పౌష్టికాహారం అందిస్తున్నామని అన్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, మండల తహసీల్దార్ వర్ణ, ఎంపీడీఓ సురేష్, ఇన్‌ఛార్జి ఎంఈఓ రాథోడ్ ఉదయ్‌రావు, స్థానిక సర్పంచ్ నర్మద పెంటన్న, ఎంపీటీసీలు పర్వీన్ లతీఫ్, సూర్యకాంత్, బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి కిరణ్, పార్టీ అధ్యక్షుడు బాలాజీ, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు ఇక్బాల్, బషీర్, తోకల చందు, గొర్ల రాజన్న, నర్సయ్య పాల్గొన్నారు.

# జీపుజాతను విజయవంతం చేద్దాం



నవతెలంగాణ-తలమడుగు, తాంసి

తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర జీపుజాత చేపట్టానున్నామని అన్నారు. ఈ జాత జిల్లా కేంద్రంలో జూన్ 16న స్థానిక ఆర్ అండ్ బి మైదానంలో జాత ప్రారంభ సభ జరుగుతుందని తెలిపారు. ఈ సభను జయప్రదం చేయాలని ప్రచారంలో భాగంగా బుధవారం తలమడుగు మండలంలోని భరంపూర్‌లో, తాంసి, భీంపూర్ మండలంలోని జీపుజాత వాల్ పోస్టర్లను అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ రాష్ట్ర జీపు జాత ప్రారంభ సభను టీచర్స్, హెల్పర్స్ విజయవంతం చేయాలని కోరారు. ఐసీడీఎస్ రక్షణ కోసం, అంగన్‌వాడీ ఉద్యోగులకు 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్స్ ప్రకారం కనీస వేతనం ఇవ్వాలని అన్నారు. పెన్షన్ ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని, ఇతర పెండింగ్ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేయాలని అన్నారు. జూన్ 16న ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్ర జీపుజాత ప్రారంభానికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఈ జాతను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ, రాష్ట్ర కోశాధికారి కే.సునీత హాజరవుతారని తెలిపారు. అదిలాబాద్ జిల్లాలో జీపుజాత జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, జిల్లా సహాయ కార్యదర్శి, వెంకటమ్మ నాయకులు స్వామి, అంగన్‌వాడీ టీచర్లు సరిత, భగీర్థ, విజయ, ప్రేమల నాయకులు నర్సింగ్, రాము పాల్గొన్నారు.

# చనాక-కోర్ట బ్యారేజ్ నిర్మాణం పూర్తి కాకపోవడం బాధకరం



నవతెలంగాణ-జైనథ్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చనాక-కోర్ట బ్యారేజీ చేపట్టింది. రెండు సంవత్సరాలలో కుర్చీ వేసుకొని పూర్తి చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ సుమారు రూ.360కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన చనాక-కోర్ట బ్యారేజ్ నిర్మాణంలో ఎందుకు నిర్లక్ష్యానికి గురిచేస్తున్నారో మాకు స్పష్టంగా అర్థం అవుతుందని జిల్లా ప్రజలను ఉద్దేశించి డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ స్పష్టం చేశారు. చనాక-కోర్ట బ్యారేజ్ కాంట్రాక్టర్ అధికార పార్టీకి చెందిన మంత్రి సోదరుడు అవడం గమనార్హమని అన్నారు. రూ.360కోట్ల అంచనా వ్యయంతో మొదలైన బ్యారేజీ నిర్మాణ పనులను 12వందల కోట్ల రూపాయల అంచనా వ్యయం పెంచడం ఎంత వరకు సమంజసం అని అన్నారు. ఇట్లానే ప్రతియేటా ఇలాగే నిర్లక్ష్యం చేసి పనులు పూర్తి చేయక ప్రతి సంవత్సరం కాంట్రాక్టర్లను అధికారులను ప్రభుత్వ పెద్దలను సంతృప్తి పరిచి వారికి ఏటీఎం లాగా చనాక-కోర్ట బ్యారేజ్ ఉందని ఎద్దేవా చేశారు. బుధవారం గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చనాక-కోర్ట గ్రామాల్లో పర్యటించి, గ్రామంలోని ప్రతి ఇంటికి, గ్రామంలోని యువతి, యువకులను అందరినీ కలుస్తూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే హామీలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు అల్లూరి సంజీవ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖడే సంతోష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపెళ్లి నగేష్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు విఠల్, జిల్లా బీసీ సెల్ చైర్మన్ అంబకంటి అశోక్, పట్టణ ప్రధాన కార్యదర్శి సాదిక్‌బాయ్, మాజీ కౌన్సిలర్ మూర్తుజా, నాయకులు గండ్రత్ వెంకన్న పాల్గొన్నారు.

## రూ.42 లక్షలతో అభివృద్ధి పనులకు భూమిపూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

గాంధీనగర్‌లో రూ.42లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మెన్ స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. బుధవారం పట్టణ సుందరీకరణ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లో విస్తృతంగా పర్యటించారు. ముందుగా వేసిన సీసీ రోడ్డు నాణ్యత ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు తాము చేసిన అభివృద్ధిని అనుభవిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే జోగు రామన్న ప్రోత్సాహంతో ప్రధాన కూడళ్ల బ్యూటిఫికేషన్ పనులను పూర్తి కానున్నాయని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిబాపూలే, కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి చౌకులను సుందరంగా తీర్చిదిద్దామని అన్నారు. త్వరలోనే స్వామి వివేకానందచౌక్ సైతం తుది దశకు చేరుకుంటుందని అన్నారు. త్వరలో వినాయకచౌక్, తెలంగాణ తల్లి చౌక్, కుమురం భీమ్‌చౌక్ ఆదిలాబాద్ అందాలు ఉట్టిపడేలా ప్రారంభించుకుంటామని అన్నారు. ప్రతి వార్డుల్లో మౌలిక వసతులను పూర్తి చేస్తున్నామని అన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.100కోట్లతో పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మడావి మంగళ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, అశోక్ స్వామి, పందిరి భూమన్న, కోవ రవి, నల్ల మహేందర్, ఎస్సై నరేందర్ పాల్గొన్నారు.

## రేషన్ షాప్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బేల మండలం ఏటి గ్రామంలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలని, 132 రేషన్ కార్డులు కలిగిన కుటుంబాలు ఉన్నాయని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. గ్రామంలో రేషన్ దుకాణం లేకపోవడంతో అనేక ఏండ్లుగా సమీప గ్రామమైన బాది గ్రామానికి వెళ్లి తీసుకువస్తున్నారని అన్నారు. రోడ్డు సౌకర్యం లేక నడుచుకుంటూ నెత్తిమీద లేదా ఎడ్ల బండిపైన ప్రతి నెల వెళ్లి బియ్యం తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఈ విషయమై బుధవారం పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్‌ను గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యపై దృష్టిసారించి ఏటి గ్రామంలోనే రేషన్‌షాప్ ఏర్పాటు చేసి గ్రామస్తుల కష్టాలను అర్థం చేసుకుని రేషన్ సరుకులు అక్కడే అందేలా చూడాలని కోరారు. సానుకూలంగా స్పందించిన పౌరసరఫరాల శాఖ అధికారి ఈ నెల నుండి గ్రామంలోనే ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్, కృష్ణ, గంగారెడ్డి, కాంతారావు, అశోక్, సుధాకర్, శాలిక్‌రావు, గణేష్, సత్యపాల్ ఉన్నారు.

## రోగులకు మెరుగైన వైద్యం

- జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ జాదవ్ ఉపేందర్



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో గతం కంటే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ జాదవ్ ఉపేందర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం వైద్య దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా ఆస్పత్రిలో వేడుకలు నిర్వహించారు. ఆస్పత్రిలో రోగులకు మూడు రకాల పండ్ల కిట్లను ఉచితంగా అందించారు. అదే విధంగా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులనుద్దేశించి మాట్లాడుతూ గతంలో ఆస్పత్రిలో సరైన సిబ్బంది లేకపోవడంతో రోగులకు సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నమని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేసేందుకు అనేక పథకాలు చేపట్టారని అన్నారు. గతంలో ఉట్నూర్ సీఎచ్‌సీ ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా అప్ గ్రేడ్ చేశారని అన్నారు. 30 పడకల ఆస్పత్రి నుండి 50 పడకల ఆస్పత్రిగా మార్పు చేసి ఆస్పత్రి ప్రత్యేక వైద్య నిపుణులను కేటాయించడంతో పాటుగా వైద్యులను, సిబ్బంది భర్తీ చేసి, రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించడంలో జాతీయస్థాయిలో అవార్డులను అందుకున్న స్థాయికి ఎదిగేలా చేశారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం వల్లే ఇదంతా జరిగిందని అన్నారు. జిల్లా ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు చేయడంతో పాటుగా సీజెరీయన్ డెలివరీ, అధునాతనమైన ఆపరేషన్ గది ఏర్పాటు చేసి, అన్ని పరికరాలు ఉన్నాయని అన్నారు. త్వరలనే ఏజెన్సీలో రోగులకు తెలంగాణ డయగ్నోస్టిక్ సెంటర్‌ను ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. ఈ వేడుకల్లో ఆస్పత్రి వైద్యులు మహేందర్, మాలతిరెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ జాడి విమల, వైద్య సిబ్బంది ఉన్నారు.

## పాఠశాలలకు సెలవులను పొడగించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

వేసవి కాలం ఎండ తీవ్రత దృష్ట్యా పాఠశాలలకు సెలవులను పొడగించాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పూర్తిస్థాయిలో వర్షాలు పడి వాతావరణం చల్లబడ్డ తరువాతనే, తరగతులు నిర్వహించాలని తెలిపారు. జూన్ మాసంలోనూ ఎండ వేడి ఇంకా తగ్గకపోవడంతో తీవ్రమైన ఉష్ణోగ్రతలలో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు వడదెబ్బ బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల ఆరోగ్యం దృష్ట్యా పాఠశాలలకు సెలవులు పొడగించాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు

నవతెలంగాణ-జన్నారం



దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం చిన్నారులకు, సర్పంచ్ జాడి గంగాధర్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఆయా ప్రధానోపాధ్యాయులు ప్రజా ప్రతినిధులు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 15 జూన్ 2023



## దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-మందమర్రి



తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మందమర్రి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో బుధవారం ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 100 మంది మహిళలు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఈ నెల 16వ తేదిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాల్లో ఇస్తామని మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సుమతి, సానిటరీ ఇన్స్‌పెక్టర్ శ్యామ్ సుందర్, మెప్మా రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో జిరాక్స్ సెంటర్ దగ్ధం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో జిరాక్స్ సెంటర్ దద్ధమైన సంఘటన జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయం సమీపంలో చోటు చేసుకుంది. బాధితుడు వెల్కం కంప్యూటర్ సెంటర్ నిర్వాహకుడు నాగోసే తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి జరిగిన షార్ట్ సర్క్యూట్ తో రూ.2.50 లక్షల విలువ గల కంప్యూటర్ సామాగ్రి, జిరాక్స్ సెంటర్ సామాగ్రి దగ్ధమైందని ఆవేదన వ్యక్తం చేశారు. దానిపైన ఆధారపడి జీవిస్తున్న తనను ఆదుకోవాలని కోరారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్ దుకాణాన్ని సందర్శించి బాధితున్ని ఓదార్చారు. ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## ఉద్యోగ నియమాక పత్రాలు అందజేత



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జీఎం కార్యాలయంలో ఇద్దరూ పీడీఎఫ్‌లకు బుధవారం ఉద్యోగ నియామక పత్రాలను జీఎం జి.దేవేందర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఉద్యోగం లభించటం గొప్ప అదృష్టమని అన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరి యువతి యువకులు నిబద్ధత పనిచేసే సింగరేణి సంస్థకు వారి కుటుంబ ఎదుగుదలకు కృషి చేయాలని అన్నారు. విధులకు గైర్హాజరు కాకుండా అధికారుల సూచనలతో ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించి ఉత్తమ ఉద్యోగులుగా మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జీఎం కెహెచ్ ఎన్ గుప్తా, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మాట్రాజ్ శ్రీనివాసరావు పర్సనల్ మేనేజర్ ఐ.లక్ష్మణరావు డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

## బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

బూత్ స్థాయిలో బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక కిమ్స్ ఆడిటోరియంలో మోర్చాల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర పార్టీ ఇచ్చిన 30 రోజుల కార్యక్రమాలను తూచ తప్పకుండా అమలు చేయాలని అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కుటుంబ పాలనను గద్దె దించి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు, కొంగ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, ఉపాధ్యక్షులు చన్నపురి గణపతి, కోశాధికారి అరుణ్‌లోయ, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు గోలెం వెంకటేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, కిసాన్‌మోర్చా అధ్యక్షులు నరసింహారెడ్డి, పార్టీ తాలూకా కన్వీనర్ వీరభద్రచారి, వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.

## మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-కౌటాల

మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి ఎంఆర్పీఎస్ పి.నాయకులు బుధవారం మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రాం విగ్రహ వద్ద పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వికలాంగుల సంఘం మండల అధ్యక్షుడు గొడిసెల రాజేష్ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ వికలాంగుల సంక్షేమం కోసం పాదయాత్ర, రాస్తారోకో, ధర్నాలు చేశారు. ప్రభుత్వం దిగి వచ్చి రూ.3016 ఉండగా ప్రభుత్వం దిగి వచ్చి పదకొండు వందలు పెన్షన్ పెంచినట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. ఇదంతా మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితం అని అన్నారు. వికలాంగులకు రూ.ఆరు వేల పింఛన్ పెంచే వరకు పోరాటాన్ని ఆపేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు పిట్టల సత్యనారాయణ పాల్గొన్నారు.

# వైద్య శాఖలో అనేక మార్పులు తెచ్చాం

- జడ్పీ చైర్పర్సన్ కోవలక్ష్మి
- ఘనంగా వైద్యారోగ్య దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ వైద్య సేవల్లో అనేక మార్పులు వచ్చాయని జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆదివాసి భవన్‌లో నిర్వహించిన వైద్యారోగ్య దినోత్సవానికి కలెక్టర్ బొర్కాడే హేమంత్, అదనపు కలెక్టర్ రాజేశం, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిపి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాల వచ్చిందని గుర్తు చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న మెడికల్ కళాశాలతో నాణ్యమైన వైద్య సేవలు అందనున్నట్లు తెలిపారు. వైద్య శాఖలో ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు అరిగేల నాగేశ్వరరావు, డాక్టర్ అజయ్ కుమార్, ద్రుపదాబాయి, చంద్రశేఖర్, ఎంపీపీ శ్రీదేవి, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ పాల్గొన్నారు.

**ఉచిత డయాలసిస్ సెంటర్ ప్రారంభం**

జిల్లా కేంద్రంలోని సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత డయాలసిస్ సెంటర్‌ను జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, కలెక్టర్ బొర్కాడే హేమంత్, జాయింట్ కలెక్టర్ రాజేశం, ఎమ్మెల్యే ఆత్రం సక్కులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న డయాలసిస్ పేషెంట్లకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి డయాలసిస్ చేసుకోవాల్సిన బాధ తప్పిందని తమ ప్రభుత్వంతోనే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

# దశాబ్ది ఉత్సవాల పేరుతో భారాలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

దశాబ్ది ఉత్సవాల పేరుతో అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలపై భారాలు మోపుతున్నారని, వారికి టీఏ, డీఏలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాలంటూ ప్రతీ కార్యక్రమానికి వీరిని పిలుస్తున్నారని, వీరు కిరాయిలు పెట్టుకొని ఆ కార్యక్రమాలకు హాజరవుతూ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వీరికి అరకొరగా వచ్చే జీతం సగానికి పైగానే వాహన కిరాయిలకు పెట్టాల్సి వస్తోందని అన్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంపై చూపే శ్రద్ధ అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తల సమపస్యలపై చూపెట్టడం లేదని అన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న రాష్ట్ర జీపు జాతా ఈ నెల 17న ఆసిఫాబాద్‌కు వస్తోందని, ఈ సందర్భంగా స్థానిక రోజ్ గార్డెన్‌లో ఉదయం పది గంటలకు నిర్వహించే బహిరంగసభలో అంగన్‌వాడీలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు స్వరూప, పద్మ, సంతోష్ పాల్గొన్నారు.

- అంగన్‌వాడీలు, ఆశాలకు టీఏ డీఏలు ఇవ్వాలి

# ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఈ నెల 24న జిల్లాకు రానున్న ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పగడ్బందీ ఏర్పాటు చేసినట్లు జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు తెలిపారు ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో బహిరంగ సభ నిర్వహించనున్న ప్రదేశాన్ని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అదనపు కలెక్టర్ రాజేశం అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన ఉందని నూతన కలెక్టరేట్ ప్రారంభంతోపాటు డీపీఓ కార్యాలయం, బీఆర్ఎస్ జిల్లా కార్యాలయ భవనం, మెడికల్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. దీనికోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పర్యటనకు జిల్లా నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, జడ్పీటీసీ నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, సింగిల్ విండో చైర్మన్ అలి బిన్ అహ్మద్ పాల్గొన్నారు.

# జేసీఐ ఆధ్వర్యంలో ప్రపంచ రక్త దాతల దినోత్సవం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా జూనియర్ ఛాంబర్ ఇంటర్ నేషనల్ (జేసీఐ) మంచిర్యాల వారి ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్త దాన శిబిరాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ వారు ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించారు. రక్త దాన శిబిరానికి ముఖ్య అతిధులుగా జేసీఐ మాజీ ప్రెసిడెంట్ తిరుపతిరెడ్డి పాల్గొని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ జేసిఐ సేవ కార్యక్రమాలు ఎంపవరింగ్ ద యూత్, బిజినెస్ శిక్షణ అంశాలో, ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీకింగ్ శిక్షణ కార్యక్రమలు అనేకం చేపట్టడం జరిగిందని అన్నారు. యువత జేసీఐలో సభ్యత్వం పొందాలని అనేక సేవ కార్యక్రమలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో 54 మంది దాతలు రక్త దానం చేయగా ప్రతి ఒక్కరిని అభినందించి, ప్రశంస పత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేసి సభ్యులు వెంకటేష్, గురవయ్య, గోశిక మల్లేష్, తుల ఆంజనేయులు, సురేష్, రహీం, ప్రేమ్, ఈశ్వర్ ప్రసాద్, మంచిర్యాల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ చందూరి మహేందర్, ట్రెజరర్ పడల రవీందర్, మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు కసర్ల శ్రీనివాస్, సత్యపాల్‌రెడ్డి, ఎడ్ల కిషన్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, సూపర్‌వైజర్ మాధవి, స్టాఫ్ నర్సులు సంధ్య, అరుణ, టెక్నీషియన్‌లు శ్రీనివాస్, శైలజ , పీఆర్ఓ రాజేష్ పాల్గొన్నారు.

# పెండ్లి కావాల్సిన యువకుడు వడదెబ్బతో మృతి

- ఒక రోజు ముందే కుటుంబంలో విషాధం

నవతెలంగాణ-కౌటాల





తెల్లవారితే పెల్లి కావాల్సిన యువకుడు వడదెబ్బతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని గుడ్లబోరి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్ల తిరుపతి(26) వడదెబ్బ తగిలి చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి చనిపోయాడు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు పెండ్లి బాజా మోగాల్సిన ఇంట్లో చావు డప్పు మోగింది. కుమారుడికి పెండ్లి చేయాల్సిన తల్లిదండ్రులు తలుచుకుంటూ బోరుణా విలపించారు. మృతునికి ఇటీవల మంచిర్యాల జిల్లా భీమిని మండల కేంద్రానికి చెందిన యువతీతో పెండ్లి నిశ్చయం అయింది. పెండ్లి పనులపై తిరుపతి గత వారం రోజులుగా బంధుమిత్రులకు తన పెండ్లి పత్రికలను పంచుతూ తప్పకుండా పెండ్లికి రావాలని బంధువులను కోరారు. ఈ క్రమంలో వారం రోజుల నుండి ఎండల తీవ్రత ఎక్కువ ఉండడంతో వడదెబ్బ తగిలి మంచం పట్టాడు. వెంటనే కుటుంబీకులు ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. చికిత్స పొందుతూ పెండ్లికి ఒకరోజు ముందే చనిపోవడం గుడ్లబోరి గ్రామంలో విషాదాన్ని నింపింది. తల్లిదండ్రులు బంధువులు తిరుపతి మృతదేహం వద్ద విలపించడం పలువురిని కంటతడిపెట్టించింది.

## జీపు జాతా పోస్టర్లు విడుదల

నవతెలంగాణ-కాగజ్‌నగర్



అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 17న ఆసిఫాబాద్‌కు రానున్న జీపు జాతాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. స్థానిక సంతోష్ ఫంక్షన్ హాలులో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చింతలమానెపల్లి మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పోస్టర్లను విడుదల చేసిన అనంతరం సీఐటీయూ నాయకులు కృష్ణమాచారి మాట్లాడుతూ ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలనే తదితర డిమాండ్లతో ఆలిండియా కమిటీ పిలుపు మేరకు జీపు జాతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జీపు జాతా 17న ఆసిఫాబాద్‌కు చేరుకుంటుందని, ఈ సందర్భంగా రోజ్ గార్డెన్‌లో నిర్వహించే బహిరంగసభకు అంగన్‌వాడీలు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతలమానెపల్లి మండల యూనియన్ నాయకులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెరిక శ్రీకాంత్ అన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే జూన్ 21 తర్వాత సమ్మెకు సంబంధించిన నోటీసును ఆసిఫాబాద్ డీపీఓ సురేందర్‌కి సమ్మె నోటీస్ అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బంది అందరిని పర్మనెంట్ చేయాలని, వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, ట్రెజరీల ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. పీఆర్సీలో నిర్ణయించిన కనీస వేతనం చెల్లించాలన్నారు. జీఓ నెంబర్ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15600, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషన్స్ డ్రైవర్లు కారోబర్ బిల్ కలెక్టర్లకు రూ.19500 నిర్ణయించాలని, కారోబార్ బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. జీఓ నెంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలన్నారు. పాత కేటగిరీలన్నిటిని యధావిధిగా కొనసాగించాలని, విధి నిర్వహణ ప్రమాదంలో జరిగే మరణించిన సిబ్బంది కుటుంబానికి రూ.10 లక్షలు నష్టపరిహారాన్ని ప్రభుత్వమే ఇవ్వాలని, ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సహజ మరణానికి ఇన్సూరెన్స్ పథకాన్ని రూ.ఐదు లక్షలకు పెంచాలన్నారు. డిమాండ్ల పరిష్కారంతో ప్రభుత్వం కృషి చేయాలని లేదంటే ఈ నెల 21 తర్వాత ఏ క్షణంలోనైనా సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాట్ల రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ శంకర్, తోట సమ్మయ్య, నక్క మల్లేష్, అశోక్, నాగేష్, శీను, రమాకాంత్, గణేష్, రాజు, లక్ష్మణ్, నవీన్, మహేష్, నాగేష్, రాజు, ప్రభాకర్, సాగర్, మోతే పద్మ, మోతె లక్ష్మికళ, పెంటుబాయి పాల్గొన్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

- జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్
- అటవీ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్ శిబిరాన్ని సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ అనేకమందికి సమాయానికి రక్తం దొరకక ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి వారికి ఇటువంటి శిబిరం ఎంతో చేయూత ఇస్తుందన్నారు. దశావళి ఉత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం దానికి పెద్ద ఎత్తున స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. రక్తదాన శిబిరం సందర్భంగా 60 మంది దాతలు రక్తదానం చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, ఎఫ్డిఓ విజయ్ కుమార్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు అప్పలకొండ, శ్రీనివాస్, దయాకర్ పాల్గొన్నారు.

## సర్పంచ్ కళ్యాణ కానుక అందజేత



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని పెద్దనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నాయకపుగూడ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం పల్లె ఎల్లయ్య-బుచ్చక్క ఏకైక కుమార్తె శిరీష వివాహానికి సర్పంచ్ కళ్యాణ కానుక రూ.5016 చీరె, సారే సర్పంచ్ వేములకృష్ణ-వకుళాదేవి దంపతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణ మాట్లాడుతూ సర్పంచ్‌గా గెలిచిన నాటి నుంచి గ్రామంలో నిరుపేద కుటుంబాలలో ఆడపిల్ల వివాహం చేయాలంటే చాలా ఆర్థిక ఇబ్బందులు పడతారని తన వంతుగా తోచిన సాయం చేస్తున్నాని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సోముని మైసక్క, వార్డు సభ్యులు కొత్త రమేష్, జయ, గ్రామ పెద్దలు కూకట్ల దేవెందర్, సోమని రాజం, లగుడం శ్రీనివాస్, రాజు, నవీన్, మల్లేష్ పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని పీటీజి గిరిజన గురుకులంలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ సురేష్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. మూడవ తరగతిలో 80, నాల్గవ తరగతిలో 45, ఐదవ తరగతిలో 6, ఆరవ తరగతి 28, తొమ్మిదవ తరగతిలో 9 సీట్లు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు కొలాం, మన్నే, తోటి తెగలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## మండల ఉత్తమ వైద్యాధికారిణిగా డాక్టర్ నయనతా

నవతెలంగాణ-జైనథ్



తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బుధవారం జనార్ధన్‌రెడ్డి గార్డెన్స్‌లో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ వైద్యాధికారిణిగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రనికి చెందిన డాక్టర్ నయనతా ఎంపికయ్యారు. ఆమెకి ఎమ్మెల్యే జోగు రామన్న, జిల్లా పరిషత్ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్, వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్‌ల చేతుల మీదుగా అవార్డును అందించి, సన్మానించారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ గోవర్ధన్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని మునిపల్లి గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ రమేష్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. బాధిత కుటుంబాన్ని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని అన్నారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మెన్ రఘునందన్ రెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మండల ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, కన్వీనర్ కృష్ణరెడ్డి, మాజీ సర్పంచ్ సయ్యద్, నాయకులు గురాల లింగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లోని బిల్లులను విడుదల చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఈ కుబేర్‌లో ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్‌రావు అన్నారు. బుధవారం ఐటీడీఏ డీడీ దిలీక్ కుమార్‌ను కలిసి విన్నవించి, సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయాలు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలో కంప్యూటర్ ఆధారిత డిజిటల్ బోధన చేయాలని అన్నారు. ప్రభుత్వం మన ఊరు మన బడి కింద మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలను ఏ విధంగా అయితే అధునికరిస్తున్నాయో అదే విధంగా జిల్లాలోని మారుమూల ప్రాంతంలో ఉన్న ఆశ్రమ ఉన్నత పాఠశాలలను కూడా ఉన్నతికరించి డిజిటలైజేషన్ చేయాలని అన్నారు. ఆశ్రమ పాఠశాలలో యేండ్ల తరబడి పని చేస్తున్న సీఆర్టీలను వెంటనే రెగ్యులర్ చేయాలని అన్నారు. జిల్లా అధ్యక్షులు బాపురావు, ప్రధాన కార్యదర్శి గోపి, నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ నాయక్, ఉపాధ్యక్షులు రాజశేఖర్ పాల్గొన్నారు.

## మెనూను పాటించాలి : సూపర్‌వైజర్ శ్రీలత



నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్

అంగన్‌వాడి కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణీలకు, పిల్లతల్లులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. బుధవారం ప్రాజెక్టు పరిధిలోని దిలావర్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న మెనూ వివరాలను రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి, ఆకుకూరలు, కూరగాయలు పెంపొందేలా చూడాలని ఆమె అంగన్‌వాడీ టీచర్లకు ఆదేశించారు. అలాగే ఇంటింటా వెళ్లి మూడు సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని తల్లులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని ఇప్పించాలని అన్నారు. పిల్లల ఎదుగుదలకు అంగన్‌వాడి కేంద్రాలు ఎంతో దోహదపడతాయని అన్నారు.

## ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వినోద్‌రెడ్డి మాట్లాడుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. పిల్లలను పనిలో కాకుండా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, వారి భవిష్యత్తులను కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు సమాజంపై కూడా ఉందన్నారు. బడీడు పిల్లల చేత కూలీ పనులు చేయిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, పాఠశాల చైర్మెన్ కృష్ణ, మహిత స్వచ్ఛంద సంస్థ మండల శిక్షణ కౌన్సిలర్ రాజేశ్వరి, వాలంటరీ సంధ్య, అంగన్‌వాడీలు మంజుల, పద్మ పిల్లల తల్లిదండ్రులు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## రేణుక మాత విగ్రహ ప్రతిష్ఠాపన



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని కారేగాం గ్రామంలో దేవాదాయశాఖ నుంచి రూ.30లక్షలతో నిర్మించిన రేణుక మాత ఆలయంలో బుధవారం వేద పండితుల మధ్య రేణుక మాత విగ్రహ ప్రతిష్ఠాపన అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేద పండితులు నవగ్రహ పూజ, పుణ్యావచనము, గణపతిపూజ, వాస్తుపూజ, యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహ ప్రతిష్ఠాపన, పూర్ణహుతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి రేణుక మాత ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు నాయకులకు ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి పాటుపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్ బాబు, సర్పంచ్ నర్సారెడ్డి, జెడ్పీటీసీ సరోజనరెడ్డి మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు లావణ్య రవిందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు అఫ్రోజ్ ఖాన్, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు సాయి మోహన్‌రెడ్డి, గంగారెడ్డి, నర్సారెడ్డి సుధాకర్, ఖాసీం మేస్త్రి, సాయన్న, శ్రీనివాస్‌గౌడ్, గంగారెడ్డి, శ్రీను, వీడీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ రైతులకు ఆదిలోనే కష్టాలు

- కరుణించని వరుణుడు
- పత్తి విత్తనాల గోస
- స్ప్రింక్లర్‌ల ద్వారా విత్తనాలకు నీరు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ఖరీఫ్ రైతుకు ఆదిలోనే కష్టాలు ఆరంభమయ్యాయి. మృగశిర కార్తె ఆరంభమై వారం రోజులు గడుస్తున్న అక్కడక్కడ ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు తప్ప ఇంతవరకు మోస్తారు వర్షం పడలేదు. గత సంవత్సరం కంటే ఋతుపవనాలు ఆలస్యంగా రావడమే దీనికి కారణమని వాతావరణ నిపుణులు తెలుపుతున్నారు. గంపెడాశలతో అప్పు చేసి పెట్టిన పత్తి విత్తనాలకు రైతులు ప్రత్యామ్నాయ బిందు సేద్యం ద్వారా నీటిని అందిస్తూ విత్తనాలను కాపాడుకుంటున్నారు. మండలంలో గత 2022-23 ఖరీఫ్ సీజన్‌లో పత్తి 20,500 ఎకరాలు, సోయా 18,500 ఎకారాలు, కంది 5,500 ఎకరాల్లో సాగుచేసినట్లు వ్యవసాయశాఖాధికారుల పేర్కొన్నారు.



మండలంలోని దనోరా(బి), గౌరాపూర్, శంకర్‌గూడ, గిన్నేర, ధర్మసాగర్, ఈశ్వర్ నగర్, హర్కాపూర్, వడ్‌గావ్‌తో పాటు వివిధ గ్రామాల రైతులు పత్తి విత్తనాలను విత్తుకున్నారు. అయితే ఋతుపవనాలు ఈ నెల 17 తరువాతనే రాష్ట్రంలో ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తోంది. దీంతో ఇప్పటికే పత్తి విత్తనాలు విత్తుకున్న రైతన్నలు ఆ కారు మబ్బుల వైపు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. మరోవైపు వాతావరణం వేడిగా ఉండటంతో రైతన్న దిగాలు చెందుతున్నాడు. రెండు, మూడు రోజుల్లో వరణుడు కరుణించక పోతే పెట్టిన విత్తనాలు నష్ట పోయే అవకాశం ఉంటుందని రైతన్న గుబులు చెందుతున్నారు.

# సీఆర్టీల నియామకం పారదర్శకంగా నిర్వహించాలి

- ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూసం సచిన్

నవతెలంగాణ-ఉట్నూర్



ఉమ్మడి ఆదిలాబాద్ వ్యాప్తంగా ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలో నూతన సీఆర్టీల నియామకాలను పారదర్శకంగా నిర్వహించాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్రఅధ్యక్షులు పూసం సచిన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం నాయకులతో కలిసి పీవీటీజీ ఏపీఓ భాస్కర్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సచిన్ మాట్లాడుతూ ఐటీడీఏ అధికారులు ఉమ్మడి జిల్లాలోని గిరిజన విద్య శాఖలో ఎన్ని ఖాళీలు ఉన్నాయో తెలియజేయాలని కోరారు. సీఆర్టీ పోస్టుల భర్తీలో అవకతవకలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని, భర్తీ ప్రక్రియను రహస్యంగా కాకుండా మెరిట్ జాబితాను బహిరంగపర్చి అభ్యర్థుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఎంపిక పరీక్ష కంటే ముందే ఏయే సబ్జెక్ట్‌లో ఎన్ని ఖాళీలు ఉన్నాయో ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మెస్రం రాజు, కొట్నాక్ లక్ష్మణ్, భూమేష్ ఉన్నారు.

# ఘనంగా వైద్యారోగ్య దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-బోథ్

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సావాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని స్వప్న జిన్నింగ్ మిల్‌లో ఏర్పాటు చేసిన వైద్యారోగ్య దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. అదేవిధంగా వైద్యారోగ్యశాఖ కరపత్రాన్ని ఆవిష్కరించి, పలువురు లబ్ధిదారులకు ఆయా న్యూట్రిషన్ కిట్, కంటి అద్దాలు అందించారు. అంగన్‌వాడి ఆయాలకు చీరలను, బీపీ కిట్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో 33 జిల్లాలలో 33 మెడికల్ కాలేజీలు నిర్మిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని అన్నారు. కేంద్రం మెడికల్ కాలేజీలలో మొండి వైఖరి చూపిస్తుందని అన్నారు. అదేవిధంగా పల్లె దవాఖానాలతో పల్లె ప్రజల వద్దకే వైద్యం చేరిందని అన్నారు. కంటి వెలుగు పథకం ద్వారా దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణ నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, ఎఎంసీ చైర్మెన్ రుక్మన్‌సింగ్, జడ్పీటీసీ సంధ్యారాణి, వైస్ ఎంపీపీ లింబాజి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు తాహెర్, సర్పంచ్ సురేందర్, వైస్ చైర్మెన్ సంజీవ్‌రెడ్డి, ఆర్బీఎస్ జగన్‌రెడ్డి, ఆత్మ చైర్మెన్ సుభాష్, ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు, బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు అబ్దుల్లా, రమణగౌడ్, జ్యోతి, ఎంపీటీసీలు, సర్పంచులు సదానందం, గంగాధర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## పుణికి వనం స్థల పరిశీలన



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని గుండం పల్లి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీలో భాగంగా పుణికి వనం నాటుటకు గ్రామ పంచాయతీ స్థలాన్ని కేటాయించగా బుధవారం డీఆర్డీఓ విజయలక్ష్మి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుణికి వనం పెంపకంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. ఇట్టి వనంలో మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్, ఎంపీఓ అజీజ్ ఖాన్, ప్లాంటేషన్ మేనేజర్ రఫి, ఏపీఓ దివ్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వాతి, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

## పోక్సో నిందితుల అరెస్టు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మైనర్ బాలికపై అత్యాచార యత్నం చేసిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు కాగజ్‌నగర్ టౌన్ సీఐ బుద్దే స్వామి తెలిపారు. బుధవారం సీఐ కేసు వివరాలను వెల్లడించారు. మైనర్ బాలికపై ఇద్దరు దుండగులు మద్యం మత్తులో అత్యాచార యత్నం జరిగిందని, బాధితురాలి తల్లి కాగజ్‌నగర్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేయడం జరిగింది. నిందితుల ఆచూకి గురించి ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి, వినయ్ గార్డెన్ చౌక్ వద్ద ఉన్నారన్న సమాచారంతో సీఐ బుద్దే స్వామి తన సిబ్బందితో కలసి నిందితులను అదుపులోకి తీసుకొని విచారించారు. అరెస్ట్ చేసి, సిర్పూర్ (టి) కోర్టులో హాజరు పరుచగా, సదరు నింధితులకు 15 రోజుల రిమాండ్ విధించి ఆసిఫాబాద్ సబ్ జైలుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

## గుండె పోటుతో కోఆప్షన్ సభ్యుడి మృతి

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్



మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ మోయిన్(54) బుధవారం మధ్యాహ్నం గుండె పోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మృతుడుకి గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు పేర్కొన్నారు. కోఆప్షన్ సభ్యుడి మృతి పట్ల మున్సిపల్ పాలకవర్గం సంతాపం వ్యక్తం చేశారు.

## అధిక ఫీజులను అరికట్టాలి : ఏఐఎస్ఎఫ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో అడ్మిషన్‌ల పేరిట ప్రయివేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోతోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుమేర్ పాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం డీఈఓ ప్రణీతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 12నుంచి పాఠశాలలు ప్రారంభమైనప్పటికి నేటికీ జిల్లాలోని ప్రయివేట్ పాఠశాలలు కనీసం 50శాతం వరకు ఫిట్‌నెస్ చేసుకోలేదని, అటువంటి బస్సులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు తబ్రెజ్ ఖాన్ ఉన్నారు.

## పల్లె ప్రగతి దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-సారంగాపూర్

దశాబ్ది వేడుకల్లో భాగంగా ఈ నెల 15న పల్లె ప్రగతి దినోత్సవ పండుగను ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ కార్యాలయంలో ఆయ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వర్షాకాలం సమీపిస్తున్నందున పారిశుధ్యంతో పాటు గ్రామాల్లోని రక్షిత మంచినీటి ట్యాంక్‌లను శుభ్రం చేయించాలని అన్నారు. తాగునీటి పైపులైన్లు లీకేజీ లేకుండా శ్రద్ధ వహించాలని అన్నారు. గ్రామ పంచాయతీలను విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో అలంకరించాలని సూచించారు. ప్రతి గ్రామంలో జండా ఎగరవేసి పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహించుకోవాలని అదేశించారు. అనంతరం గ్రామపంచాయతీలో వచ్చిన నిధులను జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని అన్నారు. పారిశుధ్య కార్మికులను సన్మానించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పతాని రాధా, ఏపీఎం మాధురి, పాల్గొన్నారు.

## బీసీలకు ఇస్తున్న రూ.లక్ష సాయం సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-రెబ్బెన

బీసీ కులస్తులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రూ.లక్ష రుణాన్ని బీసీ కులస్తులు కుమ్మరి కుల కులస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆ కుల సంఘం కుమురంభీం జిల్లా అధ్యక్షుడు కుమ్మరి మల్లేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుమ్మరి కులస్తులు అందరూ తెల్ల రేషన్ కార్డు ఉన్నవారం అందరూ 18 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాలు ఉన్నవారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 20వ తేది వరకు అందరూ ఆలైన్‌లో అప్లై చేసుకోవాలని తెలిపారు. కుమ్మరి కులస్తులు కావలసిన ధ్రువపత్రాలు కులం సర్టిఫికెట్, ఆదాయ సర్టిఫికెట్ రేషన్‌కార్డ్ బ్యాంక్ డీటెయిల్స్ పాన్ కార్డ్ ఇవి తీసుకొని మీ దగ్గరలో ఉన్న మీ సేవలో అప్లై చేసుకోవాలని ఆయన సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా 8309273303 నెంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

## ఒకపూట బడులు నిర్వహించాలి

నవతెలంగాణ-ఖానాపూర్

రాష్ట్రవ్యాప్తంగా ఎండలు తీవ్రంగా ఉండటం వలన పాఠశాలలను వారం రోజుల పాటు ఒకపూట నిర్వహించాలని లంబాడా హక్కుల పోరాట సమితి నిర్మల్ జిల్లా అధ్యక్షులు బాణావత్ గోవింద నాయక్ అన్నారు. బుధవారం స్థానిక విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యంతో క్షేత్రస్థాయిలో విద్యార్థులకు సరైన సౌకార్యాలు లేవని అన్నారు. ఎండల తీవ్రత తగ్గి కొద్దిపాటి వర్షాలు కురిసి వాతావరణం చల్లబడే వరకు విద్యార్థులకు ఒకపూట బడులు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు ప్రభాకర్, జరుపుల రాజేష్ నాయక్, విలాస్ నాయక్, నరేష్ పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరు జిల్లా వాసులకు చోటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా బీజేపీ సీనియర్ నాయకులైన నల్ల రత్నాకర్‌రెడ్డి, బొరంచు గంగారెడ్డిలకు రాష్ట్ర నాయకత్వంలో చోటు లభించింది. వీరిద్దరిని రాష్ట్ర కార్య వర్గ సభ్యులుగా నియమించడం జరిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ తెలిపారు. బుధవారం ఇరువురు నాయకులను పార్టీ కార్యాలయంలో సన్మానించి, అభినందనలు తెలిపారు. భారతీయ జనతా పార్టీ ఒక క్రమశిక్షణ గల పార్టీ ఇక్కడ కుటుంబ రాజకీయాలకు స్థానం లేదని అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన ఇరువురు మరిన్ని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశిస్తున్నామని అన్నారు. సన్మాన కార్యక్రమంలో జిల్లా నాయకులు వేదవ్యాస్, అకంత్ రమేష్, చిలుకూరి జ్యోతిరెడ్డి, ముకుంద్, కృష్ణ రవి, రాకేశ్, నాగేష్, అజయ్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన జెడ్పీటీసీ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన దొడ రాములు కుమారుడు అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి బుధవారం కాంగ్రెస్ మండల కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్‌తో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకుని ధైర్యాన్ని ఇచ్చారు. వారి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు ఏడుమేకల వెంకన్న, పోశెట్టి, రాకేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

## జగదాంబ దేవి, సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపన

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని బంగారుతండా గిరిజన గ్రామంలో బుధవారం శ్రీ జగదాంబ దేవి సంత్ సేవాలాల్, ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపనలో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ పూజారులు ఎమ్మెల్యే రేఖా నాయక్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేఖానాయక్ మాట్లాడుతూ యావత్ తెలంగాణ రైతాంగం సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ ఆలయానికి రాష్ట్ర ప్రభుత్వ రూ.20 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. మళ్ళీ రూ.5 లక్షల మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి కాంగ్రెస్ ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు ఎడమ బొజ్జు, ఉట్నూర్ జడ్పీటీసీ చారులత రాథోడ్, బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు జాన్సన్ నాయక్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, స్థానిక జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీపీ మాదాడి సరోజన, స్థానిక సర్పంచ్ లక్ష్మీబాయి, ఎంపీటీసీ సౌజన్య, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రియాజుద్దీన్ పాల్గొన్నారు. ఆలయ ప్రారంభోత్సవ, విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా భక్తులకు దాదాపు 2000 మందికి ప్రముఖ కాంట్రాక్టర్ పూర్ణచంద్రరావు అన్నదానం చేశారు.

## ఆయుర్వేద డాక్టర్‌కు ప్రశంస పత్రం

నవతెలంగాణ-తలమడుగు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యారోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆయుర్వేద డాక్టర్ శ్రీకాంత్‌కు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు చేతుల మీదుగా ప్రశంస పత్రంతో పాటు మేమోంటోను అందజేశారు. ఆయూష్ విభాగంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఈ పురస్కారం లభించినట్టు తెలిపారు.